

''మంత్రులారా! మీరు శుక్రబృహస్పతులతో సమానులు. మంచిపనే చేశారు. కానీ, ఇలాంటి పనులు నా వంటివారికి పనికిరావు. నేనిప్పుడే రాజ్యాన్ని త్యజిస్తున్నాను'' అన్నాడు.

తన తమ్ముడైన పాలకుడికి రాజ్యాన్ని అప్పగించి, కుమారుడైన నరవాహనదత్తుణ్ని అతని సంరక్షణలోనే వదిలేసి తపోవనానికి వెళ్లిపోయాడు. పాలకుడు రాజై ప్రజారంజకంగా కొంతకాలం పాలించాడు. ఒకసారి పాలకుడికి వరుసగా దుస్వప్నాలు రాసాగాయి. దాంతో ఆందోళన చెందిన పాలకుడు, తాను కూడా రాజ్యాన్ని వదిలేసి.. నరవాహనదత్తుణ్ని రాజును చేశాడు.

నరవాహనదత్తుడు రాజ్యం చేస్తుండగా ఒకనాడు.. అతనివద్దకు తన పిల్లలతో ఒక స్త్రీ వచ్చింది. ఆమె చూడటానికి చాలా అసహ్యంగా ఉంది. ఆమె పిల్లలు మాత్రం రత్నాల్లా మెరిసిపోతున్నారు. వారిని చూసి ఆశ్చర్యపడిన నరవాహనదత్తుడు.. ఎవరు మీరని అడిగాడు.

అప్పుడు ఆ స్త్రీ తన కథ ఇలా చెప్పింది..

''మహారాజా! నాపేరు పింగళిక. మాది కపిష్టిల అగ్రహారం. మా తండ్రిగారి పేరు సోమదత్తుడు. వేద వేదాంగ పారంగతుడైన ఆయనకు ధూమకేతువువంటి నేను జన్మించాను. పుట్టింది మొదలు నాకన్నీ దుర్గుణాలే. ఒక్క సుగుణమూ లేదు. ఆచారహీనురాలినై పుట్టినింటికి చెడ్డపేరు తీసుకొచ్చాను. వయసు పెరుగుతున్న కొద్దీ నా ఆగడాలకు మితి లేకుండాపోయింది. ఊళ్లో తగవులన్నీ ఇంటిమీదికి తీసుకొస్తుంటే భరించలేక, ఒక నాడు నా తండ్రి నన్ను అరణ్యంలో విడిచిపెట్టి రమ్మని శిష్యులను పురమాయించాడు.

ఆ అడవిలో చిక్కుకున్న తరువాత.. హాయిగా చచ్చిపోతే ఈ బాధలన్నీ ఉండవు కదా అనుకున్నాను. చచ్చేందుకు మార్గం వెతుక్కుంటుంటే ఓ విష్ణువు ఆలయం, దానిపక్కనే తటాకం కనిపించాయి. 'ఇందులో స్నానం చేసి, ఈ దేవుణ్ని పూజించి చచ్చిపోతే వైకుంఠం వస్తుంది' అనుకున్నాను. ఆనాటినుంచి ఆ స్వామిని పూజించడమే దినచర్యగా కొన్నిరోజులు గడిపాను. అలా ఉండగా ఒకనాడు స్వామి కలలో కనిపించాడు.

'పుత్రీ! నీ భక్తికి మెచ్చాను. ఏం వరం కావాలో కోరుకో' అన్నాడు. అప్పుడు నేను..

'స్వామీ! నన్ను వెంటనే చంపెయ్' అని కోరుకున్నాను. ఆ మాటవిని స్వామి నవ్వుతూ..

'పతి పుత్ర ధనాదులను కోరకుండా ఆత్మహత్యను కోరుకోవడం సమంజసం కాదు. జాగ్రత్తగా ఆలోచించి కోరుకో' అన్నాడు. అందుకు నేను..

'స్వామీ! నేను పూర్వజన్మంలో పుణ్యమేమీ చేయలేదు. ఈ జన్మలో నాకు పెళ్లయ్యే సూచనలేమీ కనిపించడం లేదు. అయినా ఇంతటి కురూపిని నన్ను పెళ్లి చేసుకునేవాడెవడు?! నాకు మరణమే మంచిది. వెంటనే దయచేయి' అని కోరుకున్నాను.

అప్పుడు స్వామి..

'పుత్రీ! నువ్వు అన్నమాట వాస్తవమే. పూర్వజన్మలలో నువ్వు చాలాతక్కువ పుణ్యకార్యాలే చేశావు. కానీ ఒకనాడు ఒక బ్రాహ్మణునికి కుంచెడు ధాన్యం దానమిచ్చావు. ఆయనపై నిన్ను ఉద్ధరించాల్సిన బాధ్యత ఉంది. అందుకోసమే మళ్లీ జన్మ తీసుకున్నాడు. అతనే నీకు భర్తకాగలడు. అతని కళ్లకు నువ్వు గొప్ప సౌందర్యవతిగా కనిపిస్తావు. వేరొక జన్మలో నువ్వొకసారి నువ్వులు తింటుండగా వేళ్లసందునుంచి ఎనిమిది గింజలు జారి అగ్నిహోత్రంలో పడ్డాయి. అందువల్ల నీకీ జన్మలో ఎనిమిదిమంది పిల్లలు కలుగుతారు. అయితే ఒక్కవిషయం గుర్తుపెట్టుకో. నువ్వు ధాన్యమివ్వడం వల్ల నీ భర్త అయ్యాడన్న విషయం ఆయనతో ఎన్నడూ చెప్పకు. అలా చెబితే ఆనాటితో నీకూ ఆయనకూ ఉన్న ఋణానుబంధం తెగిపోతుంది' అని సెలవిచ్చాడు.

ఆ మరునాడే నా తండ్రి నన్ను వెతుక్కుంటూ అరణ్యానికి వచ్చాడు. నన్ను ఇంటికి తీసుకుపోయాడు. కొంతకాలానికి చతుర్వేది అయిన బ్రాహ్మణుడు ఒకడు మా ఊరిమీదుగా వెళ్తూ.. మా ఇంటిలో విడిదిచేశాడు. నన్ను చూసి.. 'ఈ దివ్యాంగన ఎవరు? దేవలోకం విడిచి భూలోకానికి వచ్చినట్లుంది. సోమదత్తా! ఈమెను నాకిచ్చి వివాహం చేయగలవా?!' అని అడిగాడు.

మా తండ్రిగారు సంతోషించి, మా పెళ్లి చేశారు. ఆయన నాపట్ల అత్యంత అనురాగంతో మెలిగేవాడు. కాలక్రమంలో మాకు ఎనిమిదిమంది పిల్లలు పుట్టారు. ఒకనాడు ఆయన.. 'నాకు కాళ్లు నొప్పి పుడుతున్నాయి. కాసేపు కాళ్లు ఒత్తు!' అని అడిగాడు.

అహంకారంతో కళ్లు మూసుకుపోయి..

'నేను నిన్ను కుంచెడు ధాన్యమిచ్చి కొనుక్కున్నాను. నీకు పాద సంవాహనం చేయాల్సిన అవసరం లేదు' అని పలికాను. నా భర్త నావంక విస్మయంతో చూశాడు.

'ఎవరు నువ్వు.. నా పింగళిక ఏమైంది?!' అని ప్రశ్నించాడు. విష్ణుదేవుడు సెలవిచ్చిన నా పూర్వజన్మ రహస్యాన్ని నా భర్తకు తెలియచేశాను. దాంతో ఆయన నన్ను అసహ్యించుకుని, వదిలిపెట్టి వెళ్లిపోయాడు. మా తండ్రిగారు స్వర్గస్థుడయ్యాడు. ఇప్పుడు పిల్లల పోషణకు తంటాలు పడుతూ మిమ్మల్ని శరణుజొచ్చాను!''

.. అని చెప్పిన ఆమె కథను విని, నరవాహనదత్తుడు ఆ కుటుంబపోషణకు తగిన భత్యం ఏర్పాటుచేశాడు.

* * *

ఇంతవరకూ చెప్పిన తరువాత ఆ కథకుడు ఇంకా ఏదో చెప్పబోయేంతలో.. ఆ వీధిలో కలకలం చెలరేగింది. జనులందరూ ఇళ్లను వదిలి, తలోదిక్కుకూ పారిపోతున్నారు. 'భూమి బద్దలైపోతున్నది. పరుగెత్తండో!' అని అరుస్తున్నారు.

నాకు ఏం జరుగుతున్నదో అర్థం కాలేదు. ప్రాణభయంతో పరుగెడుతున్నవారిని ఆపి, అసలు సంగతేమిటని అడిగే అవకాశం చిక్కడం లేదు. ఇంతలో ఒక మేడ దాపున ఒక చిన్నది కాలికి రాయి తగిలి కిందపడి స్పృహతప్పి పడి ఉంది. ఆమెను లేవదీయలేక తల్లిదండ్రులు రోదిస్తున్నారు. ఎవరెవరినో సహాయం కోసం అర్థిస్తున్నారు. నేను వెనువెంటనే అక్కడికి చేరుకుని, ఆ కన్యను ఎత్తుకుని వారినొక సురక్షితమైన ప్రదేశానికి చేర్చాను. ఆమెకు మూర్ఛతేర్చాను.

''బాబూ! మాకోసం నువ్వు చిక్కుల్లో పడవద్దు. ఇక్కణ్నుంచి త్వరగా పారిపో'' అన్నాడామె తండ్రి.

''అసలేం జరిగింది? ఎందుకు మీరిలా పరిగెడుతున్నారు?'' అని నేను ప్రశ్నించాను. అందుకాయన..

''మా నగరానికి అప్పుడప్పుడూ ఒక రాక్షసుడు వస్తుంటాడు. కనిపించిన వారందరినీ పీక్కు తింటాడు. వాడు వచ్చేముందు భూమి అదురుతుంది. బీటలు వారుతుంది. ఆ పగుళ్లలోనుంచి రాక్షసుడు బయటికొస్తాడు'' అని చెబుతూ ఒక్కసారి ఉలిక్కిపడి..

''ఆ.. అయ్యయ్యో! చచ్చిపోయాంరా నాయనో..'' అని అరిచాడు.

వీధిచివర పర్వతాకారుడైన రాక్షసుడొకడు భూమిని చీల్చుకుని బయటపడ్డాడు. మావైపే రాసాగాడు. నేను కత్తి దూసి వాడిమీదికి ఉరికాను. గుహలాంటి నోరు తెరిచి, అగ్నిజ్వాలలాగా నాలుక వేలాడుతుండగా.. వాడు నన్ను తన చేతులతో పట్టుకుని మింగబోయాడు.

నేను ప్రచండవేగంతో ఒక్కవేటు వేశాను. వాడి నాలుక తెగిపడింది. వాడు గింజుకుంటుండగా రెండు చేతులూ నరికేశాను. వాడు కొండలా నేలమీద పడ్డాడు. భీషణంగా ఘోషపెట్టసాగాడు. అదును చూసుకుని వాడి మెడపై వేటువేశాను.

దాంతో రాక్షసపీడ వదిలిపోయింది. ఆ వీధిలోని వారందరూ నన్నొక దేవతలా ఆరాధనాభావంతో చూడసాగారు. పళ్లు, పూలు తెచ్చి నాకు సమర్పించసాగారు. నేను రక్షించిన బాలిక తండ్రిపేరు ధనకోటి. ఆయన పది కోట్ల దీనారాలకు అధిపతి. ఆయన తన కుమార్తెనిచ్చి నాకు పెళ్లి చేశాడు. వాళ్లు చేసిన హడావుడిలో నేను మీ సంగతి కూడా మరిచిపోయాను. ఆ మహోత్సవాలలో ఎనిమిదిరోజులు ఒక్క ఘడియలాగా వెళ్లదీశాను. ఈవేళ ఉదయాన్నే ఎవరో పెళ్లివారు పోట్లాటకు దిగారని తెలిసి వచ్చాను. వచ్చి చూసేసరికి మీరు కనిపించారు. ఆ తర్వాత జరిగిన కథ మీకు తెలిసిందే!

..అని మయూరధ్వజుడు తన కథను చెప్పడం ముగించాడు. అప్పుడు పుష్పకేతుడు..

''మన చరిత్రలు విచిత్రాలుగా ఉన్నాయి. ఒకే నగరంలో ఉంటూ కూడా వేర్వేరు దేశాల్లో ఉన్నట్లు వ్యవహరించాం. అవతలివీధిలో ఎవరో రాక్షసుడు చంపబడ్డాడని విన్నాను కానీ, చంపింది నువ్వని తెలియలేదు. ఈ నగరం ఎంతో పెద్దది కావడం వల్ల చాలా విశేషాలే చూశాం. దైవకృప చేత మనకు మంచి భార్యలు లభించారు. అమితమైన ధనాన్ని కూడా సంపాదించాం. ఇక మన దక్షిణ దిగ్విజయ యాత్ర సఫలమైనట్లుగా భావించి, ఇంటికి పోదాం'' అని చెప్పాడు.

స్త్రీరాజ్యాన్ని మంత్రుల పరం చేసి, చతురంగబల సమేతంగా పుష్పకేతుడు, సోదరులను వెంటబెట్టుకుని కొద్దికాలంలోనే కన్యాకుబ్జం చేరుకున్నాడు. వారికోసం బెంగపెట్టుకున్న తల్లిదండ్రులకు ఆనందం కలిగించాడు. ■

**(వచ్చేవారం.. కాళిదాసు - జ్ఞానతీర్థుడు)**